"ఓం యోగాధిరాజ యోగిరాజ సద్గురు
పరమహంస పరివ్రాజక.....

పక్షుల కిలకిలలు.

తెల్లటి పొగమంచు. ఆకాశం నుంచి భూమికి వేలాడదీసిన తెల్లటి పరదాలా!

దూరంగా సముద్ర ఘోష! అదృశ్య ప్రేక్షకుల కరతాళధ్వనుల్లా!.... యోగాధిరాజ యోగిరాజ సుప్రభాతం!



# మహిమ

## డా॥ చిత్తర్వు మధు

శ్రావ్యమైన కంఠస్వరంతో సోదరి నివేదిత గొంతు!

మంగళవాద్యాల హోరు!

తరువాత బ్రాహ్మణుల వేదపఠనం!

ఉదయం నాలుగున్నర. రాత్రి చీకట్లు ఇంకా ముసురుకునే ఉన్నాయి.

బద్ధకంగా లేచి కళ్లు నులుముకుని అరచేతివంక చూసుకున్నాను. అవును! ఆ సుప్రభాతం నా కోసమే!

"యోగాధిరాజ యోగిరాజ సద్గురు పరమహంస పరివ్రాజక ప్రేమానందస్వామిని...! నేనే!

కాని నిద్ర లేవగానే అరచేయి చూసుకోవడమే అలవాటు.

చాలా చిన్న వయసు నుంచి అమ్మ నేర్పిన అలవాటది.

అయినా, ఇప్పుడు యోగీశ్వరుణ్ణి.

నాకు సుప్రభాతాలు పలుకుతారు.

మంగళస్నానా లంటారు.

ప్రభాత పూజ!

హారతి.

పాద పూజ.

నివేదన!

ప్రసాదం, తీర్థం పంచిపెట్టడం. భక్త గణాల్ని ఆశీర్వదించడం. నేను క్రీగంట చూస్తే.... వాళ్ల జబ్బులు మటుమాయమయిపోతాయి! పక్షవాతాలు నయం అయిపోతాయి. ఉబ్బసాలు గుండె జబ్బులు అంతర్ధానం అవుతాయి.

... అయినా నాకి సుప్రభాతం వినడం కంటే ఒంటరిగా నిద్రలేచి, అమ్మను తలుచుకుని అరచేతిని చూసుకోవడమే అలవాటు. అరచేతి మధ్యలో, వేళ్ళలోనూ సకలదేవతలూ ఉంటారట!

.... నేనే దేవుడిని! మళ్లీ నాకు వేరే దేవుళ్లు!

.... తలుపు చప్పుడయింది.

..... రాందాస్ లోపలికి వచ్చాడు. ఆయనతోబాటే ఆశ్రమ కమిటీ అధ్యక్షుడు దాస్‌గుప్తా, సభ్యులు నలుగురూ లోపలికి వచ్చారు!

రాందాస్ నా ముఖ్య శిష్యుడు. ఈ కమిటీ వాళ్లందరూ నా ఆశ్రమ ఆర్థిక వ్యవహారాలూ, ప్రాపంచిక వ్యవహారాలూ చూసుకునే అధికారులు. వీళ్లూ నా భక్తులే. నా పాదాలు ముట్టుకునే మాట్లాడతారు. కాని నా 'సంపద'నంతా పరిరక్షించడానికి, 'సక్రమంగా' వినియోగించడానికి నాకూ వీళ్ల తెలివితేటలు అవసరం!

.... స్వామీ, ఇంకా తయారవలేదా? త్వరగా మంగళస్నానాలు కానియ్యాలి. ఎన్నో కార్యక్రమాలు జరిగిపోవాలి. పది దాటితే, ఇక వచ్చేపోయే వి.ఐ.పీ.లతో సందేడే సందడి." అ అన్నది దాస్‌గుప్తా. అరవై యేళ్ల వృద్ధుడు. నా కంటే ఐదారేళ్లు పెద్దవాడేమో! అయినా సరే నా పాదాలు స్పృశిస్తూ అన్నాడు.

అవును. ఈ రోజు చాలా ముఖ్యమైన రోజు. ఆశ్రమం స్థాపించి నలభై ఏళ్లు అయిన వార్షికోత్సవం! పైగా నా పుట్టిన రోజు కూడా ఈ రోజే!

ఈ రోజు ప్రత్యేక పూజలు!

అభిషేకాలు! నాకే.

నా తల మీదే పాలు పోస్తారు!



**మేకప్ లేక**

"సార్.. సార్.. హీరో స్పృహ తప్పి పడిపోయాడు."

"ఏం ఎందుకని?"

"హీరోయిన్‌ని మేకప్ లేకుండా చూసి."

సిహెచ్.వి.వి.ఎస్.మూర్తి [పాల్వంచ]

బంగారు నాణాలు వర్షిస్తారు. (కాని మనసులో ఆదిశంకరుడ్ని స్మరించుకుంటాను)

పాద పూజలు చేస్తారు. (కాని నా హృదయంలో ప్రేమ భావానికే వాటి నంకితం చేస్తాను)

ఈ రోజు అతి ముఖ్య అతిథులు విచ్చేస్తారు. దేశ ప్రధానీ, రాష్ట ముఖ్యమంత్రీ! ప్రముఖ వ్యాపారవేత్తలూ, సినీ నటులూ! బుద్ధి గత జీవుల నుంచి, ధనార్జనలో పట్టభద్రుల దాకా! అణుశాస్త్రవేత్తల దగ్గర్నుంచి ఉల్లిపాయల వ్యాపారుల దాకా!

..... ఈ రోజు సాయంత్రం బహిరంగ సభ. దానిలో అందరు ప్రముఖుల సమక్షంలో నాకు కనకాభిషేకం.

..... అంతకంటే ముందుగా ఆశ్రమ నూతన భవనాలకి ప్రధాని చేత శంఖుస్థాపన మహోత్సవం...

.... మధ్యాహ్నం పేదలకు అన్నదానం ముఖ్యమంత్రి చేత!

.... నలభై ఏళ్ల నా ఆశ్రమ ఆధ్యాత్మిక జీవితానికి ఒక అద్భుత జ్ఞాపికగా ఈ సమావేశం నిలిచిపోవాలి!

* * *

దివిసీమ. తెలుగుదేశపు సముద్రతీర ప్రాంతం. సరుగుడుచెట్ల తోటలు. ఇసుక మేటలు.

దూరంగా సముద్ర ఘోష. జలధిలోకి కలిసే కృష్ణమ్మ పరవళ్లు.

ఎండ... వెన్నెల... వర్షం...

ఇరవై నాలుగు గంటలూ ఆవుల్ని కాస్తూ తిరిగేవాడిని. శివలంక చిన్న గ్రామం. గ్రామం బైట స్మశానం. దాంట్లో ఒక వేపచెట్టూ, మర్రిచెట్టూ ఉండేవి.

స్మశానానికి ఆనుకుని పొలాలు.

ఆవులు పొలాల్లో గడ్డివేస్తుంటే నేను మర్రి చెట్టు క్రింద ధ్యానంలోకి వెళ్లిపోయేవాడిని.

పదేళ్లు నా కప్పుడు.

హోరు గాలిలో, ఫెళఫెళలాడే ఎండలో, వర్షాల్లో... ఏ రోజయినా, ఒక్క గంటయినా ఆ చెట్టు కింద కూచుంటేగాని రోజు గడిచేది కాదు.

మనసు ఏదో లోకాలకి విహరించేది. ఈ సృష్టి పుట్టుకల గురించి. ఆది మధ్యాంతరహితుడైన పరమాత్మ గురించి... చావు గురించి.. మనిషి గురించి.. వ్యాధీ, వృద్ధాప్యం గురించి ... ఇవన్నీ లేకుండా చేయటం ఎట్లా? అని ఆలోచించేవాడిని.

... ఒక ఎండాకాలపు మధ్యాహ్నం మా ఊరి శ్మశానంలోని మర్రిచెట్టు క్రింద ధ్యానంలో మునిగి ఉన్నాను.

"గొడ్లకాడి బుల్లోడిని" నే నప్పుడు. ఒక చిన్న నల్లటి పొట్టిలాగు. చొక్కా ఉండేది కాదు. చిందరవందరంగా జుట్టు.

శ్మశానంలో నుంచి సాగే కాలి దారి మీద ఒక వృద్ధుడు నడిచిరావడం చూశాను. ఎంతో దూరం నుంచి వస్తున్నట్లుగా భారంగా అడుగులు వేస్తూ వస్తున్నాడు.

తొంభై ఏళ్లు పైనే ఉంటాయి. పండుముదుసలి. తెల్లటి దూదిలాంటి గడ్డాలు, మీసాలు, కనుబొమ్మలు! ఎన్నో ముడతలు పడిన ముఖచర్మం. కాషాయ రంగు అంగీ, చేతిలో కమండలం. వంగిపోయిన నడుంతో.. ఆయాసపడుతూ వస్తున్నాడు.

నన్ను చూసి... ఆయన కళ్లు వెలిగాయి. ఎందుకోదగరకు వచ్చి నా తల మీద తన చెయ్యి ఉంచి ఏవో మంత్రాలు చదివాడు. కళ్లు మూసుకుని నిల్చుండిపోయాడు.

తర్వాత ఆయన తన చేతిని గాలిలోకి ఎత్తి గిరగిరా తిప్పి... "ఇందు! చెయ్యి పట్టు!" అని అన్నాడు. నా చేతిలో సువాసన గల కుంకుమ!

దణ్ణం పెట్టాను.

ఆయన ఒక నిముషం మౌనంగా ఉండి వెళ్లిపోయాడు.

ఆ మర్నాడు మిట్టమధ్యాహ్నం అదే చెట్టు కింద కూర్చుని... ఆలోచనలోపడ్డా. మనసు కేంద్రీకరించి గాలిలో చేయి తిప్పి ఓం అని శబ్దం చేశా.

నా నవనాడుల్లోంచి ఏదో విద్యుచ్ఛక్తి ప్రవహించి, ఒళ్లు జలదరించినట్లయి... చేతిలో కొంచెం కుంకుమ వెలిసింది!

నా ఆశ్చర్యానికి అంతులేదు. ధ్యానంలో మునిగిపోయా. ఆకలి లేదు. దప్పిక లేదు. నిద్రలేదు. అంతులేని సమాధి!

మూడు రోజుల తర్వాత కళ్లు తెరిచి చూసేసరికి చుట్టూ జనం. నా పక్కనే కన్నీళ్లతో అమ్మ. దూరాన అందరితో హడావిడిగా మాట్లాడుతూ రైతు కూలీగా పనిచేసే నా అన్న.

చేయి గిరగిరా తిప్పి "అమ్మా" అని నోరార పిలిచాను. "నా తండ్రే, నా బిడ్డే!" అంటూ మా అమ్మ నన్ను కౌగిలించుకుంది. "చేయి పట్టమ్మా" అని నా చేతిలోని విబూధిని తీసి ఇచ్చాను. అయితే, విబూది ఇచ్చిన విషయం కంటే నేను స్పృహలోకి వచ్చి బతికి మాట్లాడినందుకే ఆమె సంతోషపడిం దనుకుంటా.

జనం ఆశ్చర్యంతో హాహాకారాలు చేశారు. ఆ రోజు నా చేతుల్లోంచి అందరికీ కుంకుమా విబూధి దొరికాయి!

ఆ క్షణంలోనే నేను స్వామినైపోయాను. అప్పట్నించే ప్రేమానందస్వామి ఆశ్రమం వెలిసింది.

కాని.... నిజం నా కింతకంటే ఏమి తెలియదు!!!

* * *

శివలంక శివార్లలో ఆశ్రమం వెలిసింది. చిన్న పూరిపాక. చుట్టూ కర్రలతో కట్టిన దడి. దూరంగా జలధి ఘోష. హోరున గాలి చప్పుడు! ఆకు కూడా కదలని ఉక్కపోత ఒకప్పుడు!

అక్కడే నా ఆధ్యాత్మిక జీవితం మొదలయింది.

భక్తులు మొక్కులు మొక్కేవారు. కాళ్ల మీద పడేవారు. కష్టాలు తీరిన వాళ్లు మళ్లీ మళ్లీ వచ్చేవారు. తీరని వాళ్లు ముందు ముందు తీరతాయనే ఆశతో మళ్లీ మళ్లీ వచ్చేవారు. ఈ విధంగా రానురానూ వచ్చే జనం అసంఖ్యాకంగా పెరిగిపోయారు.

నా మనసులో అందరి పట్లా ప్రేమే. నా చేతిలో ఎందుకో నాకే తెల్లియని శక్తి. ఎప్పుడో ఒక్కసారి నిజంగా కుంకుమా విబూధీ వచ్చేవి. ఒక్కసారి వచ్చేవి కావు. అది నాకే తెలియని శక్తి!

మనసు అనంతానంత లోకాల్లో విహరించేది. శక్తి ఉన్నప్పుడు ఆనందించలేదు. శక్తి ఉత్పన్నం కానప్పుడు బెంగపడలేదు.

పక్షవాత రోగినీ, కుష్టువాడినీ... పెళ్లి కాదని బెంగతో బాధపడే కుంటిపిల్లనీ, తిండికి లేని ముష్టివాడినీ... అందర్నీ ఒకే ప్రేమతో ఆశీర్వదించాను.

నిజం. నా కంతకంటే ఏమీ తెలియదు.

నాలోని ప్రేమే నా శక్తి ఏమో!

ఏమయినాకాని భక్తులు తండోపతండాలుగా పెరిగారు. చింకిపాతల వాళ్ల నుంచి జరీ అంచు పంచెల వాళ్లు, ఎద్దుల బండ్లు పోయి మెర్సిడిస్ కార్ల వాళ్లు... నల్లతోలు వాళ్లేకాక, తెల్లటి ఎర్రటి చర్మాల ఛాయల వాళ్లు...!

బీదతనం స్థానే ఐశ్వర్యం.

అన్నీ లేని వారి లాగానే, అన్ని ఉన్నవాళ్లు కూడా నా భక్తులయారు.

ఫలితంగా పూరిపాక భవనం అయింది. బంతిపూల చెట్లు గులాబీ తోటలుగా మారాయి.

మురుగు కాలువలుపోయి, సుందర జల యంత్రాలు వెలిశాయి.

కిరోసిన్ గుడ్డి దీపంతో మిణుకు మిణుకుమంటూ వెలిగే చోటు దేదీప్యమానం అయింది.

ఇప్పుడు ఇక అన్నీ నాకే తెలుసుననుకున్నాను. ఇది నా మహిమే అని నాకే నమ్మకం కలిగింది.

కుంకుమ విబూదీ కాదు, గాలిలోంచి ఐశ్వర్యం సృష్టించాను!

స్వార్థం నిండిన మనుషుల మనసుల్లోంచి ప్రేమసేవ అనే ఇటుకలు తీసి సువర్ణ హర్మ్యం నిర్మించాను.



**తగిన శిక్ష**

"ఈ రచయితని ఎలా శిక్షించాలి ప్రభో... నూనెలో వేయించాలా లేక నిప్పుల్లో నడిపించాలా?" యమభటులు అడిగారు.

"ఏం వద్దుగానీ. ఈమె ముందు తెల్లకాగితాల కట్టలు ఉంచండి. కాని పెన్ మాత్రం ఇవ్వొద్దు. ఇదే ఆమెకు తగిన శిక్ష" చెప్పాడు యముడు.

పద్మశ్రీ [మాణిక్యారం]

నేను! నేనేనా!?

లేక నా శిష్యులూ, ప్రాపంచిక విషయాల్లో మేధావులైన దాస్‌గుప్తా లాంటి వాళ్లా?

కాదు, నేనే.

నాలో, బహుశా నేనే భగవంతుడననీ త్వరలో నన్ను నేనే తెలుసుకుంటాననీ, ఆ రోజు వస్తుందనీ గట్టి నమ్మకం ఏర్పడిపోయింది.

కాని నిజం! ఇంతకంటే అతన్ని వెదికే మార్గాలు నాకే తెలియవు.

ప్రేమ.... సేవ... కొంచెం మహిమ....

..... ఇవి చాలు అద్భుత వస్తుసామ్రాజ్యాన్ని నిర్మించడానికి.

... అందుకనే ప్రపంచం నలుమూలల నుంచీ వస్తున్నారు నా కోసం. నా అద్భుత మార్గదర్శకత్వం కోసం.

నేనే మార్గాన్ని. నేనే లక్ష్యాన్ని. నేనే అన్వేషకుడిని.

* * *

సభ సాయంత్రం.

ఉదయం నుంచి పూజలూ అభిషేకాలతో అలసటగా ఉంది.

మధ్యాహ్నం వి.ఐ.పి.లు హెలీకాప్టర్లలో దిగారు. నా పాదాల మీద వారి శిరస్సులు!

నన్ను నమ్మని నాస్తికులు కూడా నా మహిమల అంతర్యం మథించలేకపోయారు.

నమ్మిన ఆస్తికుల సంగతి చెప్పేదేముంది?

ఈ మధ్యాహ్నం సామూహిక భోజనాలు. సంతర్పణ. సాయంత్రం మహాసభ.

మల్లెలు గులాబీలు అలంకరించిన వేదిక!

అప్పటికే మబ్బు పట్టింది. కారు మబ్బులు.

దూరంగా జలధి ఘోష రాబోయే విలయాన్ని సూచనప్రాయంగా చెప్పింది!

కాని నేను వినలేదు. వినిపించుకోలేదు.

నా భక్తులు వేదాలూ, జ్యోతిషం చదివిన బ్రాహ్మలున్నారు. ఈ రోజు అసలే మంచిది కాదన్నారు వాళ్ళు.

కుజుడు కర్కాటకంలో జలరాశిలో ఉన్నడన్నారు. జలప్రళయం సూచనగా వుందన్నారు.

వినిపించుకోలేదు. నాకన్నీ తెలుసన్నాను.

సభావేదికపై సింహాసనం నాది! నా కటూ యిటూ దేశాన్ని ఏలే నేతలు. ఎదురుగా జనసందోహంలో ఆ నేతల భాగ్యవిధాతలు!

ఈదురుగాలి మొదలయింది.

వేదమంత్రాలు ప్రారంభించారు.

దడదడా వాన మొదలయింది.

నా శిరస్సున బంగారు నాణాలు వానగా కురుస్తున్నాయి.

ఈదురుగాలి తుఫానుగాలి అయింది.

సన్నటి జల్లు కాస్తా ఏనుగుతొండాలనుంచి వచ్చిన జడిధార అయింది.

గాలికి దూరంగా గ్రామంలోని ఇళ్ళ కప్పులు ఎగిరిపోతున్నాయి.

"భయపడకండి! కూర్చోండి! ప్రేమ విశ్వాసం ముఖ్యమైనవి" వానలో తడుస్తూ బిక్కచచ్చిపోయివున్న ప్రేక్షకసముదాయానికి విజ్ఞప్తి చేశాను.

కరెంటు పోయింది.

హాహాకారాలు! జనఘోషలో వర్షఘోష కలిసి సుడిగాలిని వెక్కిరించింది. అంధకారం!

అయినా నామీద నమ్మకం నాకు పోలేదు.

ప్రధానీ, ముఖ్యమంత్రి, అధినాయక మహానాయక ప్రముఖులందరూ హడావిడిగా వేదిక దిగి సర్దుకుంటున్నారు. అనుచరులు వారిని తీసుకు వెళ్ళిపోతున్నారు.

అప్పుడు కూడా నా ప్రశాంతత సడలలేదు. నేను సర్వశక్తిపరుడిని. నేనే ప్రకృతిని. లయాన్ని. నేనే వినయాన్ని.

* * *

భూమి అడుగునుంచి ఉరుములాంటి శబ్దం. గుండెలు బద్దలు కొట్టేటట్లు చెవులు చిల్లులు పడేటట్లు.

అందరూ చెల్లాచెదరై పరుగెడుతున్నారు. స్త్రీలూ, పిల్లలూ, హాహాకారాలు చేస్తున్నారు. మానవ ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోతున్నాయి.

అప్పుడు భూమి కంపించింది. ఆశ్రమం గోడలు బీటలు వారాయి. కప్పులు కూలుతున్నాయి.

అప్పుడే నా గుండె బద్దలయింది.

నల్లటి మృత్యువులాంటి చీకటిలో హోరున వీచే గాలికి కుంభవృష్టికి తోడుగా భూమి కంపించింది.

జీవితమంతా నాతోబాటే పెరిగి పెద్దవయిన ఆశ్రమ భవనాలు కుప్పకూలుతున్నాయి.

అప్పుడు తూర్పున సముద్రం మీద తళుక్కుమని తెల్లటి మెరుపు మెరిసింది.

ఓ క్షణం తర్వాత అందరికీ అర్థం అయింది. భూకంపంతోబాటు ఎగసిన ఉప్పెన నిముషాల్లో మా మీదకి రాబోతోంది.

కేకలు! ఆర్తనాదాలు! నీటినుంచి నింగికి ఒకే ఎత్తుగా ఎగసిన ప్రచండ కెరటం! నన్నూ నా ఆశ్రమాన్నీ ముంచెత్తింది!

అప్పుడు ఆకాశానికి చేతులెత్తి తనివిదీరా ఎలుగెత్తి అరిచాను. "ఓ భగవాన్ ఓ పరమాత్మా ఓ పరంజ్యోతీ... అందరికంటే ఉన్నత శక్తిస్వరూపుడవు నువ్వు. మహాజ్యోతివి నువ్వు.

"నేనొక అల్పమైన మిణుగురుపురుగును.

"నన్నూ నా వాళ్ళనీ రక్షించు భగవాన్!!"

* * *

జలప్రళయం. ఎన్నో గంటలూ రోజులూ నీళ్ళలో గడిచిపోయాయి. రెండురోజులో మూడు రోజులో... అందరూ ఏమయిపోయారు?

కాని నేనొక చెట్టు కొమ్మమీద నీళ్ళలో తేలుతూ బతికేవున్నా... ఎలా కొట్టుకువచ్చానో ఎత్తైన దిబ్బమీద పడివున్నా.

దూరాన మూలుగులూ, కేకలు, మాటలు. దగ్గరకు పోయి పరికించి చూస్తే

నా శిష్యులే.. దేశాధినాయకులే, స్పృహలోకి వస్తున్నారు.

తెరచిన కళ్ళల్లో నన్ను చూసి ఛీత్కరింపు... అసహ్యం...

ఈ ఘోరానికి నేనా కారకుడిని?

నువ్వే అని ఆ చూపుల అర్థం

ఆ ఛీత్కారం, అసహ్యం... ఈ గాలివాన భూకంపంకంటే దుర్భరంగా అనిపించేయి.

వారందరిలో మౌనం...

వారందరిలో ద్వేషం...



**నీళ్లెన్నుంటేనేం?**

"మీ రిప్పుడు ఈ చెరువులో దూకాలి" అన్నాడు డైరెక్టర్.

"అందులో రెం డడుగుల నీళ్ళు కూడా లేవుగా." అడిగాడు హీరో.

"మిమ్మల్ని అందులో దూకమన్నాను గానీ, ఈత కొట్టమనలేదుగా" కోపంగా అన్నాడు డైరెక్టర్.

పద్మశ్రీ [మాణిక్యారం]

తుఫాను ముగిసింది.

ఫెళ్ళున సూర్యకాంతి

చుట్టూ తగ్గిపోతున్న నీటిమట్టం.

ఆకాశంలో హెలికాప్టర్ మోత...

బాధితులకి సహాయంకోసం ఏర్పాట్లు.

హెలికాప్టర్ భూమికి చేరువకు వచ్చి... గిరగిరా తిరిగే దాని పంకాతో తడి యిసకని కోటి అణువులుగా సూర్యకాంతిలో చెదరగొడుతూ...

"రండి స్వామీ మీరూ రావచ్చు" ఒక ఉద్యోగి పిలిచాడు.

"రానని" మౌనంగా దృఢంగా సైగచేశాను.

అధినేతలూ వారి కార్యదర్శులూ తాటి నిచ్చెనమీదగా హెలికాప్టర్‌లోకి ఎగబాకుతున్నారు.

తడిసి, చిరిగిన కాషాయాంబరాలతో, జ్వరానికి వణుకుతూ... దూరాన చూస్తూ నిల్చివున్న నన్ను... ప్రేమానందస్వామిని... వెనుదిరిగి కూడా చూడలేదు!

హెలికాప్టర్ క్రమంగా ఆకాశంలోకి ఎగిరి దూరాన పిట్టంత రూపంలోకి మారి అదృశ్యం అయినాక కూడా దాని చప్పుడు వినిపిస్తోంది.

... ఆకలి, దప్పిక.. నిరుత్సాహం... నిరాశ...

ఈ క్షణం విధి అంటే ఏమిటో తెలిసింది.

నన్ను మించిన పరాశక్తి ఒక క్షణం పకపకా నవ్వింది.

ఈ ఆకలి తట్టుకోలేను. ఈ దాహం భరించలేను. ఈ జ్వరబాధ, దేహబాధ ఓర్వలేను.

ప్రేమ నేర్పిన హృదయాలలో ద్వేషం నింపుకుని వెళ్ళిపోయారు. అదే దుర్భరంగా వుంది.

నాకోసం ఎవరూ లేరు.

"ఓం..." అని ధ్యానంచేసి ఒక చిన్న రొట్టెముక్క కావాలని ప్రార్థించా.

గుప్పెట మూసి తెరిచినా ఖాళీ...

నవ్వొచ్చింది. కొద్ది కొద్దిగా ముందు నవ్వి తర్వాత దిక్కులదిరిపోయేలా నవ్వా!

నడిచి నడిచి, నీళ్ళల్లో ఈది ఈది ఈ చెట్టుకింద కూలబడ్డా

దూరాన తుఫాను బాధితుల సహాయ కార్యక్రమాలు ఇప్పుడే మొదలవుతున్నాయి.

అన్నం రొట్టెలు, పాలు అన్నీ యిస్తున్నారు. శవాలని వెలికితీస్తున్నారు.

ఎక్కడికి వెళ్ళను. నావాళ్ళేరీ? నావాళ్ళెవరు? దూరాన కుంటి బిచ్చగాడు నడిచి మెల్లగా వస్తున్నాడు.

ముదుసలి. ఏదో జబ్బువల్ల చర్మం ముడతలు పడి వికృతంగా వుంది. వాడి వెనక నల్లటి ఈగలు ముసిరే కుక్క.

నన్ను చూసి వాడి కుంటినడకలో వేగం హెచ్చింది. కుంటుకుంటూ శరవేగంగా వచ్చి చేరాడు.

"సామీ... సామీ... ఎంత కష్టం వొచ్చినాది సామీ... ఎలాగయిపోయినారు సామీ...!!"

మాట్లాడలేకపోయాను. నా పాదాలమీద వాడి కన్నీటిధారలు.

చిక్కి శల్యమైన కుక్క కుడా తోకాడించసాగింది.

ఈగలు ముసిరాయి.

"దాహం" అన్నట్లు సైగచేశా.

వాడి ఏడుపు ఆపి భుజాన వున్న జోలెలోంచి గాజుసీసా తీసి నా నోటికందించాడు.

అమృతం.

ప్రేమ నిండిన అమృతం యిది. వాడి జోలెలో పప్పూ పచ్చడీ నా నోటికందించినప్పుడు దేవతలు కూడా అసూయపడి వుంటారు.

గబగబా నమిలి తింటుంటే పోయిన సత్తువ నరనరాల్లో తిరిగి వచ్చింది.

గడగడా నీళ్ళు తాగితే మళ్ళీ సాధారణ జీవన స్పృహ వచ్చింది.

కాని ఇప్పుడు నన్ను నేను తెలుసుకున్నాను. నేనే లక్ష్యాన్ని, నేనే అన్వేషకుడిని అనుకున్నాను. నేనే కార్యం కారణం నేనే సృష్టి స్థితిలయం అనుకున్నా.

నేను ఏమీ కాను.

ఈ చరాచర జగత్తులో అద్భుత ప్రకృతిశక్తి ముందు ఒక అత్యల్ప పరమాణువును.

కాని నా శక్తి నాకు తెలిసింది.



## ఈత రాదనుకుని....

"మీ ఆయన్ని నీళ్ళల్లోకి ఎందుకు తోశావు తల్లీ?" అడిగాడు లాయర్.

"మా ఆయనకు ఈత రాదనుకున్నా సార్!" కళ్ళ వెంట నీళ్ళు తెచ్చుకుంటూ నిజాన్ని చెప్పింది విజయలక్ష్మి.

శ్రీకొండ [ఎర్రబోడు]

నా ప్రేమే నా శక్తి.

నా గర్వమే నాకు మృత్యువు.

నా సేవాదీక్షే నా బలం. నా లాలసే నా అంతం.

'ఓం' అవిద్యానించి గాలిలో చేయి తిప్పి గుప్పిట మూసి మళ్ళీ తెరిచా.

ఆశ్చర్యం... ఎర్రటి యాపిల్ పండు వెలిసింది!

"ఇందా... తీసుకో" అని వాడికిచ్చా.

"సామీ! మహాప్రభో" కాళ్ళమీద పడిపోయాడు వాడు.

నెమ్మదిగా వాడిని లేపి నిల్చోబెట్టి చేతులు జోడించి నమస్కరించా!

"శలవు! నాలో లేని పరమాత్మని నీలో చూశాను"

"సామీ!" వాడికర్థంకాలేదు.

"వెళ్ళొస్తా. నన్నాపకు" ముందుకు అడుగవేశా.

నా అన్వేషణ ఇప్పుడే ముగిసింది. మళ్ళీ వెనక్కి వెళ్ళి పడిన గోతిలో మళ్ళీ పడదల్చుకోలేదు.

నేను గ్రహించిన ప్రేమలోనే, సేవలోనే సృష్టిని వెదుక్కుంటూ.

క్రొత్త ప్రయాణం ప్రారంభిస్తా.

సుదూర తీరాల్లోకి, హిమాలయాల్లోకి కాదు. ఇక్కడికే. ఎక్కడయితే బాధితులూ దీనులూ ఆర్తులూ వుంటారో ఆ చోటికి.

నా మనసు మహిమ వాళ్ళకి అంకితం.

ఇన్నాళ్ళకి ఇప్పుడు నా లక్ష్యం తెలిసింది.



## మీనాక్షి కోరిక

అసలు పేరు శశికళ. అయినా మీనాక్షి శేషాద్రిగా వెలుగుతున్న ఈ అందాల జవ్వనికి మరో రెండు పేర్లు ఉన్నాయి - ఒకటి జయశ్రీ, రెండు మాధురి. ఈ నాలుగు పేర్లలో ఏ పేరున పిలిచినా టక్కున పలికే పవర్‌ఫుల్ లేడీ మీనాక్షి.

"దక్షిణ భారతదేశంలో చెప్పుకోదగ్గ దర్శకుడు మణిరత్నం. మణిరత్నం ఒకసారి బొంబాయి వచ్చి నాకు కథ అంతా వివరించాడు. అది నేను ఇంతవరకు చేయని సబ్జెక్ట్. కాని నేను వేరే చిత్రాల్లో బిజీగా ఉండటం వల్ల మణిరత్నం గారి సినిమాలో నటించే అవకాశం కోల్పోయాను. ఇప్పుడు మణిరత్నంగారు తన సినిమాలో నటించమంటే వెంటనే డేట్స్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను" అంటోంది మీనాక్షి శేషాద్రి.

మానస [గుంటూరు]



## అయ్యప్ప స్వామికి వజ్ర కిరీటం

తమిళ, మలయాళ, తెలుగు చిత్రాలలో పౌరాణిక పాత్రలు, ప్రత్యేకించి దేవీ పాత్రలు ధరించే కె.ఆర్.విజయ నిజ జీవితంలో మంచి నియమ నిష్ఠలతో గడుపుతుంది. దైవభక్తురాలు. మానవత్వంతో దానధర్మాలు చేస్తుంది. తన జీవితం ప్రారంభ దశలో ఎన్నో ఒడిదుడుకులకు లోనై క్రమేణా ఉన్నతస్థాయికి నటిగా ఎదిగి కోటీశ్వరుడైన వేలాయుధం నాయర్ భర్త కావడం పూర్వజన్మ సుకృతం అనుకోవాలి. ఈ భార్యాభర్తలు నిత్యమూ దైవారాధన చేయకుండా ఏ పనీ తలపెట్టరు. అయ్యప్పస్వామిపై ఉండే భక్తి విశ్వాసాలతో ఈ దంపతులు శబరిమలై అయ్యప్పస్వామి అలంకారానికి 1975వ సంవత్సరంలో వజ్ర కిరీటం సమర్పించారు. ఈ కిరీటంలో 1250 వజ్రాలు పొదగబడ్డాయి. ఆ వజ్రాలు తిరువాన్కూర్ మహారాజా వద్ద కొనుగోలు చేశారు. అప్పట్లోనే ఆరున్నర లక్షలకుపైగా కిరీటానికి ఖర్చయిందట!

నటిగా, గృహిణిగా, భక్తురాలుగా కె.ఆర్.విజయకు ప్రత్యేక స్థానం ఉంది.

సేకరణ: అరిపాక